రాజేంద్రనగర్‌లో 100 శాతం ఆస్తిపన్ను వసూలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వందశాతం ఆస్తి పన్ను వసూలు చేసినట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో రూ. 52 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్దేశించారన్నారు. అయితే సిబ్బంది సహాయ సహకారాలతో రూ. 52 కోట్లకు గాను రూ. 52 కోట్ల 68 లక్షలు వసూలు చేసి రికార్డు సృష్టించామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటూనే ఆస్తిపన్నును వసూలు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం 5 శాతం రాయితీ నేపథ్యంలో మరింత ఉత్సాహంతో ఆస్తిపన్నును వసూలు చేస్తామని పేర్కొన్నారు.

నార్సింగిలో ప్రతిష్ఠాపన పూజలు షురూ


పూజల్లో పాల్గొన్న అశోక్‌యాదవ్ తదితరులు

మణికొండ: నార్సింగి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజకుంభారాధన, ప్రతిష్ఠాంగ హోమం, పంచగవ్యాభిషేకం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అలాగే సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, ద్వారతోరణం, ధ్వజకుంభ అధివాస హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. బుధవారం మూలమంత్ర, సుదర్శన, వేంకటేశ్వర హోమాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు ఉంటాయని నిర్వాహకులు కె. సత్యనారాయణయాదవ్, ఎస్. బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ నెల 4వ తేదీ వరకు కొనసాగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఆయా కార్యక్రమాల్లో నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు


మల్లేశ్‌ను సన్మానిస్తున్న కురుమ సంఘం నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కురుమ సంఘం నాయకులు భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదం అందించారు. వేంకటేశ్వర స్వామితో పాటు (బీరప్ప దేవుడు) బీర లింగేశ్వర స్వామి కొమురెల్లి మల్లన్న ఆశీస్సులతో భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మల్లేశ్ గెలుపునకు కురుమ సంఘం నాయకులు కృషి చేయాలని ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెంకటేశ్ కురుమ, రాష్ట్ర కురుమ సంఘం యువజన అధ్యక్షులు అరుణ్ కుమార్ కురుమ, అడికి అర్జున్ కురుమ, మంగ వెంకటేశ్ కురుమ, గొరిగె మల్లేశ్,పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడుత శిక్షణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు మొదటి దశ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. రెండు రోజుల పాటు శివరాంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తరగతుల్లో పోలింగ్ ఆఫీసర్లతో పాటు అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు పోలింగ్ రోజున నిర్వహించాల్సిన విధులతో పాటు ఈవీఎం, బ్యాలెట్ పేపర్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి

అత్తాపూర్ : వేసవిలో ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. తరచూ నీరు తాగుతూ ఎండ వేడిమి నుంచి శరీర టెంపరేచర్‌ను సమతుల్యం చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం తిరగడం తగ్గించుకోవాలని, మజ్జిగ, పండ్ల రసాల వంటి ద్రవ పదార్థాలు తరచూ తీసుకుంటే డీ–హైడ్రేషన్ నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. వృద్ధులు, పిల్లలు వీలైనంత సమయాన్ని ఇండ్లలోనే గడపాలన్నారు.

మతసామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'


ఇఫ్తార్ విందులో ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి, సంజయ్‌యాదవ్

శంషాబాద్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీక అని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం రాత్రి పార్టీ పట్టణాధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్ ముదిరాజ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, సీనియర్ నాయకులు చెక్కల ఎల్లయ్య, శంషుద్దీన్, మైలారం సులోచన, నజ్ముద్దీన్, కోటీశ్వర్‌గౌడ్, గోవర్ధన్, సిద్ధేశ్వర్, శ్రీధర్, అక్రమ్‌ఖాన్, ఇమ్రాన్, శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 8 మందికి జైలు

యాకుత్‌పురా: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఎనిమిది మంది మందుబాబులకు కోర్టు 2 నుంచి 4 రోజుల పాటు జైలు శిక్షతో పాటు జరిమానా విధించిందని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనలు నడుపుతున్న 21 మందిపై కేసులు నమోదయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన నాంపల్లి 12వ మెట్రోపాలిటన్ డీడీ కోర్టు న్యాయమూర్తి 16 కేసుల్లో ఒక్కొక్కరికి రూ.2100ల జరిమానా విధించారు. ఈ కేసులో నలుగురికి 4 రోజులు, మరో నలుగురికి 2 రోజుల శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. మరో వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు రద్దు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ఓపెన్ నాలాలు..!



ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ ప్రధాన రహదారికిరువైపులా ధ్వంసమైన డివైడర్లు

- ప్రమాదాలబారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారిపై వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఓపెన్ నాలాలు ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు అందులో పడకుండా జీహెచ్‌ఎంసీ ఇరువైపులా ఏర్పాటు చేసిన డివైడర్లు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆరంఘర్ నుంచి దుర్గానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఇరువైపులా డివైడర్లు ఏర్పాటు చేశారు. అయితే వాహనాలు వాటిని ఢీకొట్టినప్పుడల్లా అవి కూలిపోయాయి. దీంతో అందులోకి చెత్తాచెదారం నిండిపోతుంది. ప్రధాన రహదారికి ఆనుకొని మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్ పారిశ్రామిక వాడలు ఉన్నాయి. ఈ విషయమై అక్కడి ప్రజలు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో కూలిన డివైడర్లు కనిపించకపోవడంతో అందులో వాహనదారులు పడిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రతిరోజు జీహెచ్‌ఎంసీ అధికారులు ఇదే రోడ్డు గుండా వెళ్తున్నా.. చూసి చూడనట్లుగా వ్యవరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే మురుగునీరును డ్రైనేజీలో కలపాలి. కానీ ఓ ఫంక్షన్ యజమాని ఓపెన్ నాలాలో కలుపుతుండడంతో అది నిల్వ ఉండి దుర్వాసన వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ఫంక్షన్ హాల్ వారి నుంచి 'మామూళ్లు' తీసుకొని చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇదే రోడ్డు గుండా ప్రతిరోజు మార్నింగ్ కొందరు వాకింగ్‌కు వెళ్తుంటారు. అయితే దుర్వాసన వెదజల్లుతుండడంతో వాకింగ్‌కు వెళ్లలేకపోతున్నామని వారు అంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ఓపెన్ నాలాపై డివైడర్‌ను ఏర్పాటు చేసి అందులో మురుగునీరు కలవకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరువైపుల డివైడర్లు ఏర్పాటు చేస్తాం..



ఆరాంఘర్ నుంచి దుర్గానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గతంలో ఇరువైపులా ఓపెన్ నాలాపై డివైడర్లు నిర్మించినం. అయితే వాహనాలు ఢీకొని అవి ధ్వంసమయ్యాయి. డివైడర్ల ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేసి నూతనంగా నిర్మిస్తాం. ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతాం.

–నరేందర్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఈఈ

ఓపెన్ నాలాపై డివైడర్లు లేకపోవడంతో ప్రమాదాలు..



ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఓపెన్ నాలాలు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు ఢీకొని ఇరువైపులా డివైడర్లు ధ్వంసమయ్యాయి. వాటిని మళ్లీ నిర్మించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. అందులో వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. దీనికితోడూ అందులోనే మురుగునీరు కలిసి దుర్వాసన వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్లు ఏర్పాటు చేయాలి .

–రమేశ్‌రెడ్డి, బాబుల్‌రెడ్డినగర్ నవయువ యూత్ ఉపాధ్యక్షుడు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాజేంద్రనగర్: హైదరాబాద్ మహానగరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఐటీ ఉద్యోగులు నడుం కట్టారు. ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయీస్ సంస్థ (ఎఫ్ఐటీఈ) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్న సంస్థ సభ్యులను అభినందించారు. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఐటీ కంపెనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సముదాయాల్లోని ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర శర్మ, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్, ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయీస్ అధ్యక్షుడు చుట్టూరి వినోద్ కుమార్, నాయకులు బూతూరి శ్రీరామ్, అవినీకాంత్ పాండే, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గుమ్మడి కృష్ణారెడ్డినగర్‌లో శనివారం బ్లూకోల్ట్స్ సిబ్బంది వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడు. గమనించిన వారు దగ్గరికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. స్థానికులను విచారించగా భిక్షటన చేసే వ్యక్తిగా తెలిపారు. దీంతో మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకున్నారు. ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


పవన్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లిలోని ఉడంగడ్డలో పవన్ (28) తల్లితో కలిసి ఉంటున్నాడు. వృత్తిరీత్య సెలూన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ మధ్యనే సొంతంగా ఇల్లు కూడా కట్టుకున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తల్లి ఉదయం లేచి చూసే సరికి ఫ్యాన్‌కు వేలాడుతు కనిపించాడు. వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మొదలైన నీటి సరఫరా

మణికొండ: సింగూరు జలాశయం నుంచి నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలతో పాటు షేక్‌పేట రిజర్వాయర్‌కు సరఫరా చేసే 1200 ఎంఎం డయా పైప్‌లైన్ సోమవారం అర్ధరాత్రి మోకిల వద్ద పగిలిపోయింది. దీంతో మంగళవారం నీటి సరఫరా నిలిచిపోయింది. అటు జలమండలి నీటి సరఫరాతో పాటు ట్యాంకర్ల సరఫరా సైతం నిలిచిపోవడంతో పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేదేమి లేక కొందరు ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించారు. సమస్య తీవ్రతతో జలమండలి ట్రాన్స్‌మిషన్ అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచే పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టగా సాయంత్రానికి పనులు పూర్తికావడంతో రాత్రికి నీటి సరఫరాను పునరుద్ధరించారు. మంగళవారం రాత్రి ముందుగా ట్యాంకర్లు వెళ్లలేని మణికొండ, పుప్పాలగూడ, నార్సింగి గ్రామాలతో పాటు పేదలు నివసించే కాలనీలకు ముందుగా సరఫరాను ప్రారంభించి అర్ధరాత్రి తరువాత మిగితా కాలనీలకు సరఫరా చేశారు. గతంలో పైప్‌లైన్ పగిలితే మరమ్మతులకు మూడు రోజుల సమయం పట్టేదని, ఇప్పుడు 18 గంటల వ్యవధిలోనే నీటి సరఫరాను పునరుద్ధరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మంగళవారం నీటి సరఫరా లేకపోవడంతో మణికొండలో నిలిచిన ట్యాంకర్లు

ఉద్యమకారులకే పదవులు కేటాయించాలి

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో ఉద్యమకాలం నుంచి పార్టీకి పనిచేసిన వారిని గుర్తించి ఇన్‌చార్జి పదవి, ఇతర పదవులను ఇవ్వాలని బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన జియాగూడలో మాట్లాడుతూ..ఇటీవల కార్వాన్ బీఆర్ఎస్ పార్టీ నుంచి బడా నాయకులు పదవులు అనుభవించి ఇతర పార్టీలకు మద్దతు పలికి కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయ్యారని పేర్కొన్నారు. ఉద్యమకారులను గుర్తించి ఇన్‌చార్జి పదవి, ఇతర పదవులను ఇవ్వాలని హైకమాండ్‌ను త్వరలో కోరుతున్నట్లు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొంతమంది బడా నాయకులు పనిగట్టుకుని అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇలాంటి వారితో పార్టీకి ఒరిగేది ఏమీ లేదన్నారు. నియోజకవర్గం నుంచి హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

బైక్ మెకానిక్‌లే టార్గెట్

- నీ కారణంగానే..బైక్ పాడైందని..
- పోలీస్ పేరిట బెదిరింపులు
- అక్రమంగా డబ్బుల వసూళ్లు
- అరెస్ట్ చేసిన ఆర్‌జీఐఏ పోలీసులు

శంషాబాద్: బైక్ మెకానిక్‌లే లక్ష్యంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఒకరిని ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం నాగసాల గ్రామానికి చెందిన బోయ రాజు (26) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శంషాబాద్‌లో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్న నానాజీపూర్ గ్రామానికి చెందిన శివకు రెండు రోజుల కిందట ఫోన్ చేశాడు. నీ వద్ద బైక్ రిపేర్ చేయించుకుని వెళ్తున్నానని మార్గమధ్యంలో ఆగిపోయిందని బాగు చేసేందుకు మెకానిక్ రూ. 7 వేలు చార్జీ చేస్తున్నాడు అని చెప్పాడు. తాను పోలీసు అని వెంటనే రూ. 7 వేలు వేయకపోతే స్థానిక పోలీసులు నీ వద్దకు వస్తారని బెదిరించాడు. దీంతో మెకానిక్ శివ రూ. 2 వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించాడు. అనంతరం అనుమానం వచ్చి వాట్సాప్‌లోని మెకానిక్ గ్రూప్‌లో అతడి గురించి వెతికాడు. ఎవరు కూడా అతడి వాహనాన్ని రిపేర్ చేసినట్లు తెలపకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం సాయంత్రం నిందితుడిని అరెస్ట్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో 20 పైగా ఈ తరహా మోసాలు చేసినట్లు గుర్తించారు. గతంలో కూడా అతడిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. బైక్ మెకానిక్ అప్రమత్తమై ఇచ్చిన సమాచారం మేరకు అతడిని అభినందించారు. ఈ తరహా మోసాలుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

నేటి నుంచి సిటీ కళాశాలలో జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీల్లో జాతీయ సదస్సు జరుగనున్నదని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. సీఎస్ఐఆర్, ఢిల్లీ సహకారంతో ఎనర్జీ మెటీరియల్స్–పరికరాలలో పురోగతి అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుందన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



లేమూర్ గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న మహావీర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. కళాశాల విద్యార్థులతో కలిసి ఎన్ఎస్ఎస్ అధికారి వీరేంద్ర పాటిల్ ఆధ్వర్యంలో లేమూర్ గ్రామంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడంతో పర్యావరణం తీవ్రంగా కలుషితం అవుతుందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని పనులుంటే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుళాయిలు, బోర్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే విధానాన్ని ప్రజలకు వివరించారు. ఇదిలాఉంటే లేమూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు కంప్యూటర్ క్లాసులు, ఆంగ్ల బోధన శిక్షణ ఇచ్చేందుకు కళాశాల నుంచి అధ్యాపకులను పంపించాలని కోరగా ఆయన ఒప్పుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, దాత రాణా ప్రతాప్ రెడ్డి, ఎస్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

'బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలి'


ఆరె మైసమ్మ ఆలయం వద్ద బీజేపీ నాయకులు

బండ్లగూడ: కేంద్రం ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్ షో, గడపగడపకూ ఎన్నికల ప్రచార కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆరె మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, అంజన్‌కుమార్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, కన్వీనర్ మల్లేశ్‌యాదవ్, మహాలింగం, బుక్క వేణుగోపాల్, వై.శ్రీధర్, కార్పొరేటర్ సంగీత, కొండె మహేశ్ యాదవ్, జోగి రవి, కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండిన పంటకు ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి


కొంగరకలాన్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ డిమాండ్

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్రంలో ఎండిన పంటకు ఎకరాకు రూ.25వేలు, మిగతా పంటలకు రూ.500 బోనస్ ఇవ్వాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డిజిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో చేస్తామని చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చినాక వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట పట్టాకే సర్కిల్ పంటల విషయంలో కళ్ళు తెరిచిందన్నారు. బీఆర్ఎస్ పోరాటాల వల్లే రైతులకు కొంత ఊరట లభించిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ అడుగడుగునా రైతులకు అన్యాయం చేస్తోందన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: రాష్ట్ర స్థాయిలో మహిళా వైద్య విద్యార్థులకు మహిళ వైద్య విద్యార్థులకు జరిగిన క్రీడల్లో ఉస్మానియా వైద్య విద్యార్థులు కనబరిచిన ప్రతిభ అభినందనీయమని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం ఆయన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి సన్మానించారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 37 మెడికల్ కళాశాల విద్యార్థినులు పాల్గొనగా చెస్, ఫుట్‌బాల్, టెన్నిస్ వంటి క్రీడల్లో మొదటి రెండవ స్థానాలను దక్కించుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలోనే ఓరల్ చాంపియన్‌షిప్‌లో 3వ స్థానంలో ఉస్మానియా మెడికల్ కళాశాల నిలిచిందన్నారు. అదేవిధంగా ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ విద్యార్థులకు వరల్డ్ హెల్త్ డేను పురస్కరించుకొని జాతీయ స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రిల్ 7న ప్రశంస పత్రాలను ప్రిన్సిపాల్ అందజేయనున్నట్లు ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ కె.భవాని తెలిపారు. క్విజ్ పోటీలను అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మిషా, డాక్టర్ శ్రీలత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టకియుద్దీన్, డాక్టర్ కిరణ్మయ్, ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్, పీడీ సందీప్ పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డికి బుద్ధి చెబుతాం'

గన్‌ఫౌండ్రీ: లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు టికెట్ కేటాయించకపోతే తన తడాఖ చూపిస్తామని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ తెలిపారు. పార్లమెంటు సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని నిరసిస్తూ మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో పార్లమెంటు స్థానాలలో 3 స్థానాలు ఎస్సీలకు ఉండగా రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెగెస్ పార్టీ కేటాయించకపోవడంపై మండపడ్డారు. మాదిగల ద్రోహి అయిన సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. మాదిగలపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 10 రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదిక స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగా, పూజలోల్ల రవి మాదిగ, ఇనుముల నర్సయ్య మాదిగ పాల్గొన్నారు.

